

# యువ నాయకుడు జడ సతీష్ అకాల మరణం కట్ర్యాలలో విషాద ఛాయలు



## కుటుంబ సభ్యులను పరామర్శించిన రావు పద్మ, ఎనుగుల రాకేష్ రెడ్డి



**వర్ధన్నపేట/మార్చి2(జర్నలిస్ట్ వార్త);** మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన యువ నాయకుడు జడ సతీష్ అకాల మరణం స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. సతీష్ మృతి వార్త తెలిసిన వెంటనే పలువురు రాజకీయ ప్రముఖులు, కార్యకర్తలు ఆయన నివాసానికి చేరుకుని సంతాపం వ్యక్తం చేశారు.

**నివాళులర్పించిన ప్రముఖులు**

మహిళా మోర్చా అధ్యక్షురాలు రావు పద్మ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎనుగుల రాకేష్ రెడ్డి సోమవారం కట్ర్యాల గ్రామంలోని సతీష్ నివాసాన్ని సందర్శించారు. ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పుత్రశోకంతో ఉన్న తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ

చిన్న వయసులోనే సతీష్ మరణించడం అత్యంత బాధాకరం. ఇది ఆయన కుటుంబానికే కాకుండా, స్థానిక రాజకీయ శ్రేణులకు తీరని లోటు.

సతీష్ కుటుంబానికి ఏ అవసరం వచ్చినా, ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**ముగిసిన అంత్యక్రియలు**

సతీష్ అంత్యక్రియల్లో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో యువత, గ్రామస్తులు పాల్గొని అశ్రునయనాలతో ఆయనకు నిడ్కోలు పలికారు. గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.



### కన్నీటి వీడ్కోలు.. డప్పు చప్పుళ్ల మధ్య జడ సతీష్ అంత్యక్రియలు

ఆ గ్రామం నిన్నటి వరకు సందడిగా ఉండేది.. కానీ నేడు మూగబోయింది. ఆ యువకుడు అందరితో కలివిడిగా ఉంటూ భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో అడుగులు వేశాడు. కానీ విధి ఆడిన వింత నాటకంలో అనంత లోకాలకు వెళ్ళిపోయాడు. వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామానికి చెందిన యువ నాయకుడు జడ సతీష్ అంత్యక్రియలు సోమవారం అత్యంత విషాదకర వాతావరణంలో ముగిశాయి. సతీష్ భౌతిక కాయాన్ని కడసారి చూసేందుకు నియోజకవర్గ నలుమూలల నుండి అభిమానులు, యువత భారీగా తరలివచ్చారు. అంతిమ యాత్ర ప్రారంభం కాగానే డప్పు చప్పుళ్లు, సతీష్ అమర్ రహే అన్న నినాదాలతో గ్రామం మార్మోగిపోయింది. తమ మధ్య తిరిగిన యువ నాయకుడు ఇలా విగతజీవిగా పడి ఉండటం చూసి స్నేహితులు, తోటి కార్యకర్తలు తట్టుకోలేకపోయారు. ఈ అంతిమ యాత్రలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేవలం ఒక నాయకుడిగానే కాకుండా, అందరితో ఆత్మీయంగా ఉండే సతీష్ మరణం తమకు వ్యక్తిగత లోటు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డప్పుల దరువుల మధ్య సాగిన ఊరేగింపులో ప్రతి కన్నూ చెమర్చింది. సతీష్ చేసిన సేవా కార్యక్రమాలను, ఆయన చిరునవ్వును గుర్తు చేసుకుంటూ యువత కన్నీటి నివాళులర్పించారు.





**తరలివచ్చిన జనసందోహం**

సతీష్ అంత్యక్రియలకు రాజకీయ ప్రముఖులతో పాటు, భారీ ఎత్తున మహిళలు, వృద్ధులు హాజరయ్యారు. పుత్రశోకంతో అలమటిస్తున్న తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. గ్రామ శివార్లలో అంత్యక్రియలు ముగిసే వరకు ప్రజలు అక్కడే ఉండి తమ ప్రియతమ యువ నాయకుడికి అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు.

# పదో తరగతి విద్యార్థులకు అండగా అంబేద్కర్ యువజన సంఘం

## ఐదేళ్లుగా నిరంతరాయంగా పరీక్షా సామాగ్రి పంపిణీ.. రాజేందర్‌కు ఘన సన్మానం

**గణపురం/మార్చి 2 (జర్నలిస్ట్ వార్తలు):** పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పిస్తూ, వారికి అవసరమైన విద్యా సామాగ్రిని అందించడం అభినందనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. సోమవారం గణపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, స్టేషనరీ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.పాఠశాల హెచ్ఎం దేసు సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, అప్పయ్యపల్లి సర్పంచ్ ఎలుకపెల్లి రమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సామాజిక దృక్పథంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతుందని పేర్కొన్నారు.గత ఐదు సంవత్సరాలుగా నిరంతరాయంగా విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందజేస్తున్న అంబేద్కర్



యువజన సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ సేవలను ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా ప్రశంసించింది. ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.ఈ సేవా కార్యక్రమంలోసంఘం అధ్యక్షులు తిక్క సంపత్, ఉపసర్పంచ్ ఓరుగంటి కృష్ణ.వ్యవస్థాపక సభ్యులు కట్ల శంకరయ్య, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు ఆరుముళ్ళ ఎల్లస్వామి.దూడపాక దుర్గయ్య, డీలర్ దూడపాక శ్రీనివాస్, సిలువేరు ఉదయాకర్.

ఉపాధ్యాయులు సరిత, రమేష్, రాంబాబు, సంఘ నాయకులు కొంపెల్లి సాంబయ్య, పెండేలా తిరుపతి, శివ తదితరులు పాల్గొన్నారు.

వార్త ముగింపు: పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇలాంటి చిన్నపాటి సాయం అందించడం వల్ల వారు మరింత ఉత్సాహంతో పరీక్షలకు హాజరవుతారని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# గుండె పోటు తో వ్యక్తి మృతి

**రాయపర్తి/మార్చ్ 2(జర్నలిస్ట్ వార్త):** గుండె పోటు తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది.మండలంలోని గణేష్ కుంట తండా గ్రామానికి చెందిన మునావత్ చత్రు నాయక్(50)సోమవారం ఉదయం గుండె పోటు తో మృతి చెందాడు.మృతుడు తొర్రూరు పట్టణ కేంద్రంలోని దుబ్బ తండ లో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వర్తిస్తున్నారు.మృతునికి భార్య,ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.చత్రు నాయక్ మృతితో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



# అతుకుల బొంత.. ఉద్యోగి జీవితం!

ఆకాశాన్ని అంటుతున్న ధరలు, అడుగడుగునా ఎదురయ్యే ఆర్థిక సవాళ్లు వెరసి నేటి సగటు ఉద్యోగి జీవితం ఒక అతుకుల బొంత గా మారింది. నెల తిరగకముందే చేతిలోని నగదు హరించుకుపోతుంటే, చాలిచాలని జీతాలతో సంసారాన్ని ఈడ్చడం కత్తిమీద సాములా పరిణమించింది. అభివృద్ధి సూచీలు అంకెల్లో కనిపిస్తున్నా, సామాన్య ఉద్యోగి ఇంటి బడ్జెట్‌లో మాత్రం లోటు స్పష్టంగా కనిపిస్తోంది.

**ఖర్చుల కుంపటిలో జీతగాడు**

ఒకప్పుడు ప్రభుత్వ లేదా ప్రైవేటు ఉద్యోగం అంటే అదొక భరోసా. కానీ, నేడు పరిస్థితి తలకిందులైంది. అద్దెలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు రెండింతలు పెరగగా వేతనాలు మాత్రం అల్పాదాయ వృద్ధిని దాటడం లేదు. నెలాఖరు వచ్చేసరికి అప్పుల కోసం అన్వేషించని మధ్యతరగతి గడప నేడు అరుదుగా కనిపిస్తోంది. గృహ రుణాలు, వాహన రుణాలు, క్రెడిట్ కార్డుల చెల్లింపుల చక్రవ్యూహంలో చిక్కుకుని, కనీస అవసరాలను కూడా వాయిదా వేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

**అభద్రతా భావం**

కేవలం ఆర్థిక ఇబ్బందులే కాకుండా, ఉద్యోగ భద్రత లేకపోవడం కూడా మానసిక ఒత్తిడిని పెంచుతోంది. పని వేళల పెంపు, పెరిగిన పని భారం తో కుటుంబానికి సమయం కేటాయించలేక, వ్యక్తిగత జీవితాన్ని బలి ఇస్తున్నారు. కార్పొరేట్ రంగంలో లేఆఫ్ ల భయం ఒకవైపు, ప్రభుత్వ రంగంలో కొత్త నియామకాలు లేక ఉన్నవారిపైనే భారం పడటం మరోవైపు ఉద్యోగిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

**నిర్మాణాత్మక మార్పు అవసరం**

పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతన సవరణలు జరగకపోవడం శోచనీయం. కేవలం పండుగకో, పబ్బానికో ఇచ్చే అరకొర రాయితీలు వారి జీవితాల్లో వెలుగులు నింపలేవు. పటిష్టమైన వేతన విధానం, ధరల నియంత్రణ, మధ్యతరగతికి ఊరటనిచ్చే పన్ను మినహాయింపులు ఉంటేనే ఉద్యోగి నిశ్చింతగా తన విధులను నిర్వర్తించగలడు.

రాజ్యాంగానికి, సమాజానికి వెన్నెముకగా నిలిచే మధ్యతరగతి ఉద్యోగి ఆర్థికంగా కుంగిపోతే అది దేశ పురోభివృద్ధిపై ప్రభావం చూపుతుంది. వారి బ్రతుకు చిత్రం అతుకుల బొంతలా కాకుండా, ఆత్మగౌరవంతో కూడిన పట్టువస్త్రంలా ఉండాలంటే ప్రభుత్వాలు, యాజమాన్యాలు మానవీయ కోణంలో స్పందించాలి. శ్రమకు తగిన ఫలితం దక్కినప్పుడే ఉద్యోగ ధర్మం సార్థకమవుతుంది.



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్.
సెల్ నంబర్ 9701249103

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి /మార్చి 2 (జర్నలిస్ట్ వార్త);** ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి మొత్తం 65 దరఖాస్తులు స్వీకరించి తక్షణ చర్యలకు సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ఆయా దరఖాస్తులను అధికారులు జాప్యం చేయక తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన అన్ని దరఖాస్తులు వచ్చే సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్



ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు ఇస్తున్నారని, అందువల్ల అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో పర్యవేక్షణ లోపిస్తే సంబంధిత అధికారులపై



చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓ హరికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ సీనియర్ నేత చెక్కా మధుసూదన్ రావు కన్నుమూత

**సత్తుపల్లి/మార్చి2(జర్నలిస్ట్ వార్త);** భారతీయ జనతా పార్టీలో క్రమశిక్షణ గల కార్యకర్తగా, గరుడుగట్టిన కాషాయ ధీరుడిగా పేరుగాంచిన సీనియర్ నాయకులు చెక్కా మధుసూదన్ రావు గారు ఈరోజు సత్తుపల్లిలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త విన్న వెంటనే పార్టీ శ్రేణుల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.ఈ సందర్భంగా నాయకులు ఆయన సేవలను స్మరించుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.జనసంఘ్ కాలం నుంచే పార్టీ సిద్ధాంతాలను నమ్మి, జీవితాంతం కాషాయ జెండా నీడన కష్టపడిన మధుసూదన్ రావు



మరణం పార్టీకి, ముఖ్యంగా ఈ ప్రాంతానికి తీరని లోటు.మధుసూదన్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తూ నాయకులు నివాళులర్పించారు. మధుసూదన్ రావు భౌతికకాయాన్ని సందర్శించి



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఇతర ముఖ్య నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ వి రమేష్, నాయుడు రాఘవరావు,పాలకొల్లు శ్రీనివాస్ బాబోత్ విజయ్, మంద శివ, వసంతరావు, నాగ స్వామి, డాక్టర్ పెద్దిరాజు, తదితరులు ఉన్నారు.

